సాక్షి శ్రీకాకుళం

మంగళవారం । 21 । నవంబర్ । 2023



ఆటకు వేళాయె

గ్రిగ్స్ జోనల్ పోటీలు నేటి నుంచి మొదలు కానున్నాయి. అధికారులు ఏర్పాట్లు చేశారు.

- 8లో



దోచుకోవడమే టీడీపీ పని

టీడీపీ నాయకులపై స్పీకర్ విమర్శలు ఎక్కుపెట్టారు. పొందూరులో ఆయన ప్రసంగించారు.

- 8లో

డిగ్రీ రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: బీఆర్‌ఏయూ పరిధిలోని డిగ్రీ రెండు, మూడు రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల చేసినట్లు వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు తెలిపారు. 2022 నవంబర్‌లో రెండో సెమిస్టర్, 2023 మార్చిలో మూడో సెమిస్టర్ పరీక్షలు జరిగినట్లు తెలిపారు. ఫలితాలను జ్ఞాన భూమి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

శ్రీముఖలింగం హుండీ ఆదాయం రూ.1.01 లక్షలు

జలుమూరు: శ్రీముఖలింగంలో కార్తీక మాసం మొదటి సోమవారం హుండీ ఆదాయం రూ.1,01,280 వచ్చినట్లు ఈఓ పి.ప్రభాకర రావు తెలిపారు. ఇందులో ప్రత్యేక దర్శనం రూ. 42,820, ప్రసాదం రూ. 15,900, వస్త్ర హుండీ రూ. 40,380 తదితరవి మొత్తం రూ.1,01,280 వచ్చిందని తెలిపారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల విధుల్లో అధికారులు అలసత్వం వహించరాదని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ హెచ్చరించారు. రానున్న నెలరోజుల పాటు ఓటర్ల జాబితాకు సంబంధించిన పనుల్లో క్రియాశీలకంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈఆర్వోలు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్‌తో సోమవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 57 వేల మంది ఓటర్లు రెండేసి చోట్ల ఓట్లను కలిగి ఉన్నారని, వారికి వెంటనే ఫారం ఏ నోటీసును అందజేసి వారికి ఎక్కడ ఓటు హక్కు కావాలో 15 రోజుల్లోగా నిర్ధారించి క్లెయిమ్‌ను పరిష్కరించాలని స్పష్టం చేశారు. నిర్ధారిత సమయంలోగా ఫారం 6 సహా అన్ని రకాల దరఖాస్తులను పెండింగ్ లేకుండా చూడాలని తెలిపారు. ఫొటోలు, చిరునామా తప్పుగా ఉన్న క్లెయిము ల విషయంలో ఏ మాత్రం అశ్రద్ధ వహించరాదని సూచించారు. పోలింగ్ స్టేషన్ల వారీ దరఖాస్తుల పరిశీలన బూత్ లెవెల్ ఆఫీసర్ ద్వారా పూర్తి చేయాలని, ఈఆర్‌ఓ దగ్గర మండలం వారీగా ఆ సమాచారం ఉండాలన్నారు. బూత్ లెవెల్ ఏజెంట్ దగ్గర పెండింగ్ ఉంటే స్వయంగా తహసీల్దార్లు సందర్శించి క్లెయిమ్‌లను పరిష్కరించాల్సిందేనని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఆర్‌ఓ ఎం.గణపతిరావు తదితరులు ఉన్నారు.

ప్రతిష్టాత్మకంగా కులగణన



కవిటిలో కులగణనపై శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్ త్రినాథరావు

కవిటి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న కులగణన ప్రక్రియను ఈ నెల 27వ తేదీ నుంచి పకడ్బందీగా నిర్వహించేందుకు సిబ్బంది సమాయత్తం కావాలని మాస్టర్ ట్రైనీ ఆఫీసర్, టెక్కలి డివిజనల్ అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ టి.త్రినాథరావు అన్నారు. ఆయన సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పి.సూర్యనారాయణ అధ్యక్షతన సచివాలయ కార్యదర్శులు, ఇతర సచివాలయ ఉద్యోగులతో ఇందుకు సంబంధించిన ఒక రోజు శిక్షణ శిబిరం నిర్వహించారు. నవంబర్ 27న ప్రారంభం కానున్న ఈ కులగణన ప్రక్రియను ఏ విధంగా చేయాలన్న అంశంపై సచివాలయాల స్థాయిలో వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి పంచాయతీ కార్యదర్శులు ఈ నెల 23న అవగాహన శిక్షణ శిబిరం నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించి ప్రతి సచివాలయ ఉద్యోగికి ఇద్దరు గ్రామ వలంటీర్లను అనుసంధానిస్తారు. వారు గ్రామస్థాయిలో ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారని తెలిపారు. ఇందుకు సంబంధించిన డేటా వాస్తవికతను బలం చేకూర్చేందుకు బయోమెట్రిక్ అథంటికేషన్ విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. శ్రీకాకుళంలోని బలగ వద్ద ఉన్న గవర్నమెంట్ ఐటీఐ ఇన్‌స్టిట్యూట్‌లో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పౌరులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనవసర తగాదాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది గేదెల ఇంది రా ప్రసాద్, సాంఘిక సంస్కర్త మంత్రి వెంకటస్వామి, కళాశాల ట్రైనీ ఆఫీసర్ ఎస్.లక్ష్మణరావు, డిప్యూటీ ట్రైనింగ్ ఆఫీసర్ ఎస్.గోవిందరావు, ట్రైనింగ్ ఆఫీసర్ ఎం.మురళీకృష్ణ, ఐటీఐ విద్యార్థులు పాల్గొన్నారు.



కాశీబుగ్గ: పలాస మండలం సవరగోవిందపురం గ్రామంలో స్వయంభూలింగేశ్వరుని వద్ద క్యూకట్టిన భక్తులు

శివం.. సుందరం

పంచాక్షర మంత్రధ్వనితో ఊళ్లు మేలుకున్నాయి. తొలి కిరణాలు వచ్చే సరికే ఆలయాల దారులు బారులు తీరిన భక్తులతో కళకళలాడాయి. పవిత్ర కార్తీక మాసం తొలి సోమవారాన శివుడికి ఊరూరా అభిషేకార్చనలు వైభవంగా జరిగాయి. ప్రధాన శైవక్షేత్రాలతో పాటు పల్లెపల్లెనా శివాలయాలు సుందరంగా ముస్తాబయ్యాయి.



శ్రీకాకుళం కల్చరల్: ఉమారుద్రునికి అభిషేకాలు



శ్రీముఖలింగం: క్యూలో ఉన్న భక్తులు



టెక్కలి: కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా టెక్కలి మండలం రావివలసలో ఎండల మల్లన్నకు పూజలు చేస్తున్న భక్తులు

ప్రగతి పరుగులు.. బతుకుల్లో వెలుగులు

- మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి
- నేడు చేపల విక్రయాలకు వీలుగా నాలుగు చక్రాలు, మూడు చక్రాలు, ద్విచక్ర వాహనాల పంపిణీ
- పీఎంఎంఎస్‌వై పథకం కింద రూ.20 కోట్లతో 307 యూనిట్లు
- మత్స్యకార భరోసా పేరిట ఐదు విడతల్లో రూ.70.61 కోట్లు పంపిణీ



అరసవల్లి:

గంగపుత్రుల బెంగ తీరేలా అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రభుత్వం అందజేస్తోంది. మత్స్యకారుల బతుకుల్లో వెలుగులు నింపేలా వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోంది. పలు యూనిట్ల పంపిణీ నుంచి వేట నిషేధ భృతి వరకు వారికి మంచి జరిగేలా పనులు చేస్తోంది. తాజాగా ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా జిల్లాలో రూ.58.29 లక్షల విలువైన మూడు యూనిట్లను లాంఛనంగా మంగళవారం ఉదయం ప్రారంభించనున్నారు. ఇందులో భావనపాడుకు చెందిన వై.హైమవతికి రూ. 10 లక్షల విలువైన ఫిష్ కియోస్క్ యూనిట్‌ను మంజూరు చేయనుండగా, రూ.35 లక్షల విలువైన మొబైల్ ఆక్వా ల్యాబ్‌ను వి.శ్రీధర్ అనే లబ్ధిదారునికి, అలాగే రూ.13.29 లక్షల విలువైన ఫిష్ సీడ్ ట్రాన్స్‌పోర్టు వాహనాన్ని వీఎల్‌ఎన్ ప్రసన్నకు అందజేయనున్నారు. అయితే ఈ మూడు యూనిట్లకు ప్రభుత్వం తరపున సబ్సిడీ అందించనున్నారు.

మత్స్యకార ప్రాంతాల్లో అభివృద్ధి ఇలా..

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మత్స్యకారుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ వచ్చింది. వారి జీవన ప్రమాణాలు, విద్య, వైద్యంతో పాటు మత్స్య సంపద మార్కెటింగ్ సదుపాయాలతో పాటు ఫిష్ ఆంధ్రా పేరిట ప్రత్యేక సబ్సిడీతో మత్స్యకారులు చేపలను అమ్ముకునేందుకు వీలైన సదుపాయాలను కల్పించారు. ఇక జిల్లా ముఖచిత్రం మార్చేలా సంతబొమ్మాళి తీర ప్రాంతంలో మూలపేట వద్ద రూ.4,362 కోట్లతో భారీ పోర్టు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అలాగే వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటలో రూ.14 కోట్లతో ఫిష్ ల్యాండింగ్ సెంటర్, అలాగే ఎచ్చెర్ల మండలం బుడగట్ల పాలెంలో రూ.365.81 కోట్లతో ఫిషింగ్ హార్బర్ నిర్మించేందుకు టెండర్లు కూడా ఖరారు చేశారు. ఈ నిర్మాణాలు పూర్తయితే జిల్లాలో పారిశ్రామిక ప్రగతి పెరగడంతో పాటు ప్రధానంగా మత్స్యకారుల వలసల నియంత్రణ సాధ్యమవుతుంది. 193 కిలోమీటర్ల సుదీర్ఘ తీర ప్రాంతమున్న జిల్లాలో త్వరలో చెన్నై–విశాఖ కోస్టల్ కారిడార్ కూడా నిర్మాణం మొదలయితే జిల్లా రూపురేఖలు, తీర ప్రాంతాల్లో మత్స్యకారుల జీవన పరిస్థితులు అద్భుతంగా మారుతాయి.

అలాగే గత ప్రభుత్వం వేట నిషేధ సమయాల్లో రూ.4000 భృతిగా చెల్లిస్తే ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఆ భృతిని రూ.10 వేలకు పెంచుతూ వరుసగా ఐదు విడతలుగా 70 వేల మందికి పైగా వారి ఖాతాల్లోకి జమ చేసింది.

జిల్లా రూపురేఖలు మారతాయి



అత్యంత పొడవైన తీర ప్రాంతమున్న మన జిల్లా మత్స్యకార ప్రాంతాల అభివృద్ధికి పూర్తి అనువైన ప్రాంతం. జిల్లాలో పోర్టులు, హార్బర్ల నిర్మాణం పూర్తయితే జిల్లా రూపురేఖలు మారుతాయి. ముఖ్యంగా మత్స్యకార యువత ఉపాధి కోసం దేశ విదేశాలకు వలసలు వెళ్లడం తగ్గుతుంది. మా శాఖ పరంగా అర్హత ఉంటే ప్రభుత్వం నుంచి మంజూరైన ప్రతి పథకం నేరుగా పారదర్శకంగా అందిస్తున్నాం.

– పీవీ శ్రీనివాసరావు, మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్

2019 నుంచి సంక్షేమం ఇలా

- వైఎస్సార్ మత్స్యకార బీమా పేరిట ఇప్పటివరకు వివిధ కారణాలతో మృతిచెందిన 23 మంది కుటుంబాలకు రూ.1.15 కోట్లు వర కు చెల్లించింది.
- వేటనిషేధ సమయంలో వైఎస్సార్ మత్స్యకార భరోసా పేరిట 70,611 మందికి ఐదు విడతల్లో రూ.70.61 కోట్లు వారి ఖాతాల్లోకి నేరుగా జమ చేసింది. అలాగే 432 మంది అర్హులకు కిసాన్ క్రెడిట్ కార్డు రుణాలను అందించారు.
- ప్రధాన మంత్రి మత్స్యసంపద యోజన 2021 నుంచి 2023 మార్చి వరకు రూ.20 కోట్లతో 307 యూనిట్లను మంజూరు చేయగా ప్రస్తుతం వరకు రూ.2.02 కోట్ల విలువైన యూనిట్లు గ్రౌండింగ్ అయ్యాయి.

స్పందనకు 220 వినతులు



వినతులు స్వీకరిస్తున్న జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 220 వినతులు అందాయి. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో పాటు సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ప్రత్యేక ఉప కలెక్టర్ డాక్టర్ జి.జయదేవి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావులు అర్జీలు స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ స్పందన ద్వారా అర్జీదారులు లాభపడాలని, ఈ విషయంలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ప్రజలకు సేవకులుగానే భావించాలని, కావున ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని సూచించారు.

పోలీసు స్పందనకు 40 అర్జీలు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి ఫిర్యాదుదారుల నుంచి 40 అర్జీలు అందాయి. ఎస్పీ రాధిక వాటిని పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. అదనపు ఎస్పీలు విఠలేశ్వరరావు, తిప్పేస్వామిలు కూడా అర్జీలు స్వీకరించారు.

ఇంటింటా సంక్షేమం

సదుపాయాలు బాగున్నాయి



మాది చాలా పేద కుటుంబం. మేము పదేళ్లగా శ్రీకాకుళం పరిధిలోని బొందిలీపురంలో అద్దె ఇంటిలో నెలకు రూ.4వేలు వెచ్చిస్తూ జీవనం సాగించేవాళ్లం. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్నాక మాకు శ్రీకాకుళం పరిధిలోని రాగోలు అర్బన్ లేఅవుట్‌లో ఇల్లు మంజూరైంది. కొత్త ఇంటిలోకి వచ్చి రెండు నెలలు కావస్తోంది. ఇక్కడ అన్ని సదుపాయాలు బాగున్నాయి. మాకు సొంత ఇంటి కల నెరవేర్చినందుకు జీవితాంతం ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం.



– నీలవేణి, రాగోలు అర్బన్ లేఅవుట్ (శ్రీకాకుళం రూరల్)



సొంతింటిలో ఉంటా అనుకోలేదు

నా జీవితంలో సొంతింటిలో ఉంటానని ఎప్పుడూ అనుకోలేదు. నేను దివ్యాంగురాలిని, నా భర్త పిల్లలను నా వద్ద విడిచిపెట్టి వెళ్లిపోయాడు. దీంతో ఊరిలోనే అద్దె ఇళ్లలో ఉండేదాన్ని. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక నాకు ఇంటి స్థలం ఇచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక సాయం, నా కుమారులు కొంత సాయం చేయడంతో ఇల్లు కట్టుకున్నాను. ప్రభుత్వం ద్వారా దివ్యాంగుల పింఛన్ రూ.3 వేలు, వైఎస్సార్ చేయూత రూ.18,500, వైఎస్సార్ ఆసరా పథకాలు అందుతున్నాయి. పేదలకు సంక్షేమ పథకాలు అందజేసి, అన్ని విధాలా మేలు చేస్తున్న సీఎం కలకాలం కొనసాగాలి.

– దున్న చంద్రమ్మ, పాలవలస,సోంపేట

శ్రీకాకుళం ఉప విద్యాశాఖాధికారిగా విజయకుమారి



విజయకుమారి

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి(డీవైఈఓ)గా ఆర్.విజయకుమారి నియామకం అయ్యారు. ఈమేరకు ఆదివారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం విజయకుమారి శ్రీకాకుళం డీవైఈఓగా బాధ్యత లు చేపట్టారు. పలువురు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, ప్రైవేటు పాఠశాలల ప్రతినిధులు ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. విజయకుమారి గతంలోను ఉప విద్యాశాఖాధికారిగా పని చేసి మెప్పించారు.

ఉన్నతాధికారుల నుంచి ప్రసంశలు సైతం అందుకున్నారు. ఆర్జేడీ ఎం.జ్యోతికుమారి, డీఈఓ కె.వెంకటేశ్వరరావు, సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్, తదితరులు అభినందించారు. కొత్త బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని ఆకాంక్షించారు.

కంపెనీ సెక్రటరీ కోర్సుతో ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న పీఆర్‌వీ శివరామకృష్ణ, పక్కనే ప్రిన్సిపాల్ సూర్యచంద్ర, కృష్ణారావు

శ్రీకాకుళం న్యూకాలనీ: కంపెనీ సెక్రటరీ కోర్సు పూర్తి చేయడం వల్ల అనేక ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఐసీఎస్‌ఐ విశాఖపట్నం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పీఆర్‌వీ శివరామకృష్ణ పేర్కొన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలో కళాశాల వాణిజ్యశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో సోమవారం కంపెనీ సెక్రటరీ కోర్సుకు సంబంధించిన అవగాహన సదస్సును బీకాం విద్యార్థులకు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో కంపెనీ సెక్రటరీ కోర్సు, సీఏ, ఐసీడబ్ల్యూల ప్రాధాన్యతలను వివరించారు. ఇంజినీర్లు, డాక్టర్లకు మించిన ప్యాకేజీలు లభించే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో కామర్స్ హెచ్‌ఓడీ ఎల్.కృష్ణారావు, వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి, చింతాడ కృష్ణారావు, కె.లలితాభాయి సిబ్బంది పాల్గొన్నారు.

24 నుంచి జిల్లాస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

ఎచ్చెర్ల క్యాంపస్: కేశవరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 24 నుంచి 26 వరకు బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు హెచ్‌ఎం చల్లా భారతి, జిల్లా పీఈటీ సంఘం అధ్యక్షుడు మొజ్జాడ వెంకటరమణ తెలిపారు. పాఠశాలలో సోమవారం వివరాలు వెల్లడించారు. శ్రీకాకుళం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బాలుర అండర్ 14, 17, 17 పోటీలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కానున్నట్లు తెలిపారు. విజేతలు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని అన్నారు.

విద్యుత్ వెలుగుల్లో కిడ్నీ ఆస్పత్రి



పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్ సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. కిలోమీటరు దూరం నుంచి సైతం అక్షరాలు కనపడేలా విద్యుత్ అలంకరణతో పలాస కిడ్నీ ఆస్పత్రి ఆకట్టుకుంటోంది. –కాశీబుగ్గ

క్లుప్తంగా

పాతపట్నం జోగికొండపై పెద్దపులి



దశరథపురంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అటవీ శాఖ అధికారులు

పాతపట్నం: పాతపట్నంను ఆనుకుని ఉన్న జోగికొండపై పెద్దపులి ఉన్నట్లు ఆనవాళ్లు ఉన్నాయని, పాతపట్నంతో పాటు కొండ చుట్టూ ఉన్న ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పాతపట్నం ఫారెస్ట్ రేంజర్ ఆర్.రాజశేఖర్ అన్నారు. సోమవారం తెల్లవారుజామున అంతరాబ ఫారెస్ట్‌ను ఆనుకుని ఉన్న దశరథపురం శివాలయం పక్కన ఉన్న చెరువు వద్దకు పులి వెళ్లినట్లు ఆనవాళ్లు కనిపించాయని తెలిపారు. పాతపట్నం, అంతరాబ, దశరథపురం, తిడ్డిమి పరిసర ప్రాంత ప్రజలు సాయంత్రం అయితే బయటకు రావద్దని, రాత్రి వేళల్లో పంట పొలాలకు, తెల్లవారు జామున ఆలయాలకు వెళ్లవద్దన్నారు. దశరథపురంలో సోమవారం అవగాహన కల్పించారు. ఫారెస్ట్ సెక్షన్ అధికారి పి.యశస్వి, ఎఫ్‌బీఓ కె.ఉమా మహేశ్వర రావు, ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

1104 సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గోపాలరావు



గోపాలరావును సన్మానిస్తున్న సంఘ ప్రతినిధులు

అరసవల్లి: ఏపీ ఎలక్ట్రిసిటీ ఉద్యోగుల సంఘం (1104) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎంవీ గోపాలరావు (గోపి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు విజయవాడ లయోలా కాలేజీలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో ఈయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొత్తగా ప్రధాన కార్యదర్శి హోదాలో గోపాలరావు తొలిసారిగా జిల్లాకు రావడంతో సోమవారం 1104 సంఘ నాయకులు, విద్యుత్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆయన్ను ఘనంగా సత్కరించారు. అనంతరం స్థానిక యూనియన్ కార్యాలయంలో కీలక ప్రతినిధులతో సమావేశమయ్యారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మెళియాపుట్టి: మండలంలోని సిరియాఖండి పంచాయతీ మాకనాపల్లి గ్రామానికి చెందిన మండల లక్ష్మీ నారాయణ సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మధ్యాహ్నం గ్రామ శివార్లలోని ఓ తోటలో అపస్మారక స్థితిలో పడి ఉండటంతో స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. వారు లక్ష్మీనారాయణను పాతపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రాష్ట్రస్థాయి కబడ్డీలో శ్రీకాకుళం సత్తా

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం జిల్లా క్రీడాకారులు స్కూల్‌గేమ్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో విజయవిహారం కొనసాగిస్తున్నారు. ఈ సీజన్ మొత్తంలో అన్ని క్రీడాంశాల్లోను విజయబావుటా ఎగురవేస్తూ వస్తున్నారు. తాజాగా అన్నమయ్య జిల్లా చిత్వేల్ వేదికగా ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు జరిగిన ఏపీ రాష్ట్ర స్కూల్‌గేమ్స్ అండర్-14 బాలికల కబడ్డీ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా జట్టు చాంపియన్‌గా నిలిచి శభాష్ అనిపించింది. ట్రోఫీతోపాటు బంగారు పతకాలు, మెమోంటోలను అందుకున్నారు. ఈ టోర్నీలో అత్యద్భుతంగా రాణించిన ముగ్గురు క్రీడాకారులు బి.ఆకాంక్ష (జెడ్పీహెచ్‌స్కూల్ పల్లిసారధి), ఎ.చాందిని (జెడ్పీహెచ్‌స్కూల్ బాసురు), డి.సాయిజశ్వంత్ (జెడ్పీహెచ్‌స్కూల్ సీతాపురం) జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా జట్టు రాణింపుపై డీఈఓ కె.వెంకటేశ్వరరావు, ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు, పీడీలు, కబడ్డీ సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



చైర్మన్ సువర్ణ చేతుల మీదుగా బహుమతులు అందుకుంటున్న గురుకుల పాఠశాల విద్యార్థినులు

శ్రీకాకుళం అర్బన్, శ్రీకాకుళం న్యూ కాలనీ: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షురాలు సువ్వారి సువర్ణ ముఖ్య అతిథిగా పాల్గొని వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. విద్యార్థులకు చిన్నతనం నుంచి లైబ్రరీ అలవాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళంలోని హయాతీ నగరంలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల బాలికల సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థినులు డ్రాయింగ్‌లో పి.దుర్గాభాయ్(9వ తరగతి) ప్రథమ స్థానం, పాటలు, రంగోళిలో ఎం.త్రివేణి (8వ తరగతి) ద్వితీయ స్థానం, బి.లహరి (9వ తరగతి) ద్వితీయ స్థానంలో నిలిచి బహుమతులు అందుకున్నారు. వీరిని సోమవారం పాఠశాల ప్రిన్సిపాల్ జి.స్వరాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

ఆటకు వేళాయె

- నేటి నుంచి గ్రిగ్స్ జోనల్‌స్థాయి పోటీలు
- తొలుత జోన్-3, జోన్-4లో పోరు
- డిసెంబర్ రెండో వారంలో జోన్ 1, 2, ఫైనల్ పోటీలు
- ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేసిన జిల్లా పాఠశాలల క్రీడల సంఘం



గ్రిగ్స్ జోనల్ స్థాయి పోటీలకు సిద్ధం చేసిన పతకాలు, మెమొంటోలతో తిరుమలచైతన్య, పీఈటీ సంఘ నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ:

పాఠశాలల క్రీడల గ్రిగ్స్ తదుపరి పోటీలకు రంగం సిద్ధమైంది. మండల స్థాయి తర్వాత జోనల్ స్థాయి గ్రిగ్స్ పోటీలు మంగళవారం నుంచి మొదలుకానున్నాయి. విద్యాశాఖ పరిధిలో ఉన్న జిల్లా పాఠశాలల క్రీడల సంఘం ఆధ్వర్యంలో మూడు దశల్లో జరుగుతున్న ఈ పోటీల్లో భాగంగా ఇప్పటికే మొదటి దశలో మండలస్థాయి పోటీలు జిల్లా వ్యాప్తంగా కన్నుల పండువలా సాగిన విషయం తెలిసిందే.

నేటి నుంచి జోనల్ స్థాయి పోరు..

జోనల్‌స్థాయి గ్రిగ్స్ పోటీలకు జిల్లా పాఠశాలల క్రీడల సంఘం ప్రతిష్టాత్మకంగా భావించి ఏర్పాటు చేసింది. ఈ నెల 21 నుంచి జోనల్ స్థాయి గ్రిగ్స్ పోటీలు మొదలుకానున్నాయి. షెడ్యూల్‌లో భాగంగా ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు జోన్-3(శ్రీకాకుళం, నరసన్నపేట) పోటీలు గార మండలంలోని కళింగపట్నంలో ఉన్న బుద్ధ హైస్కూల్ వేదికగా జరగనున్నాయి. అలాగే ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు జోన్-4(ఎచ్చెర్ల, ఆమదాలవలస) పోటీలు ఆమదాలవలస మండలం తొగరాం జెడ్పీహెచ్‌స్కూల్ వేదికగా బాలికలకు జరపనున్నారు. జిల్లాలో మొత్తం నాలుగు జోన్లు ఉన్నాయి. రెండేసి నియోజకవర్గాలతో కూడిన నాలుగు జోన్లను ఏర్పాటు చేశారు.

శ్రీకాకుళంలో ఫైనల్ పోటీలు..

డిసెంబర్ రెండో వారంలో జోన్-1 (ఇచ్ఛాపురం,పలాస), జోన్-2 (టెక్కలి, పాతపట్నం) పోటీలను నిర్వహించనున్నారు. జిల్లాస్థాయి ఫైనల్స్ పోటీలు సీనియర్స్ విభాగంలో డిసెంబర్ రెండో వారంలోనే శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని జరపనున్నారు. పోటీలు జరగనున్న జోన్లకు పతకాలు, మెమొంటోలు, సర్టిఫికెట్లను చేరవేశారు. వీటిని జిల్లా పాఠశాలల క్రీడల సంఘం అధ్యక్షుడు, డీఈఓ ఆదేశాల మేరకు కార్యదర్శి, డిప్యూటీ డీఈఓ డాక్టర్ తిరుమల చైతన్య వీటిని ఆయా జోన్ల నిర్వాహకులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బలగ ఎంహెచ్‌స్కూల్ హెచ్‌ఎం ఏవీ మురళీకృష్ణ, జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు ఎంఈ రమణ, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ఎస్‌జీఎఫ్, గ్రిగ్స్ సెక్రటరీలు బీవీ రమణ, కె.మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి



జోనల్ స్థాయి గ్రిగ్స్ పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు/బాలబాలికలు వారి పాఠశాల హెచ్‌ఎం సంతకం, పాఠశాల రౌండ్‌సీల్ వేసిన స్టడీ సర్టిఫికెట్ విధిగా తీసుకురావాలి. ఐడీ కార్డులు ఉంటే తీసుకురావాల్సి ఉంటుందని డీఈఓ కె.వెంకటేశ్వరరావు ఆదేశించారు. జోనల్‌స్థాయి గ్రిగ్స్ పోటీలను విజయవంతం చేయాలి. పీడీలు, పీఈటీలంతా సమష్టిగా పని చేసి జిల్లాకు పేరు తీసుకురావాలి.

– కె.మాధవరావు, జిల్లా పాఠశాల సంఘం సంయుక్త/గ్రిగ్స్ సెక్రటరీ

వైజాగ్–చెన్నై కారిడార్‌తో జిల్లాకు లబ్ధి

- నీతి ఆయోగ్ ప్రాంతీయ సమావేశంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్



వర్చువల్ విధానంలో ప్రాంతీయ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: అపారమైన గ్రానైట్ నిల్వలు, 193 కిలోమీటర్ల సువిశాల సముద్ర తీరం, 175 కిలోమీటర్ల జాతీయ రహదారి, ప్రధాన రైల్వే లైను కలిగి ఉండటం శ్రీకాకుళం ప్రత్యేకత అని కలెక్టర్ శ్రీకేష్ బి. లాఠకర్ పేర్కొన్నారు. విశాఖ వేదికగా ఉత్తరాంధ్ర జిల్లాల నీతి ఆయోగ్ జీ హబ్ ప్రాంతీయ సమావేశంలో వర్చువల్‌గా ఆయన హాజరై మాట్లాడారు. జిల్లా అభివృద్ధికి తీసుకోగలిగే చర్యలపై మాట్లాడారు. ఒకప్పుడు వలసల జిల్లాగా పేరున్న శ్రీకాకుళం జిల్లాకు మెల్లమెల్లగా ఆ పేరు తొలగిపోతోందని చెప్పారు. వైజాగ్–చెన్నై కారిడార్ నిర్మాణంతో ఇచ్ఛాపురం వరకు వెళ్లే కారిడార్ కారణంగా జిల్లా రూపురేఖలు మారుతాయన్నారు. కొవ్వాడలో అణు విద్యుత్ కేంద్ర నిర్మాణంతో ప్రపంచ పటంలో కొవ్వాడకు స్థానం లభిస్తుందన్నారు. సువిశాలమైన సముద్ర తీరంలో టూరిజం, జెట్టీలు, ఫిష్ లాండింగ్ సెంటర్లు నిర్మించడం ద్వారా మత్స్యకారుల వలసల నివారణ సాధ్యమవుతుందన్నారు. నీతి ఆయోగ్ స్పెషల్ సెక్రటరీ అనారాయ్, స్టేట్ టాక్స్ కమిషనర్ గిరిజా శంకర్, నీతి ఆయోగ్ నేషనల్ అడ్వైజర్ పార్థసారథి రెడ్డి, మెకిన్సీ కంపెనీ ప్రతినిధులు అభిలేష్, వరల్డ్ రిసోర్స్ ఇన్‌స్టిట్యూట్ ప్రతినిధులు తదితరులు లేవనెత్తిన పలు అంశాలకు కలెక్టర్ బదులిచ్చారు.

రాష్ట్ర తైక్వాండో పోటీల్లో శ్రీకాకుళం హవా



నిర్వాహకుల నుంచి మెమోంటోలు, పతకాలు అందుకుంటున్న జిల్లా తైక్వాండో క్రీడాకారుల బృందం

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా క్రీడాకారులు పతకాల పంట పండించి సత్తా చాటారు. గుంటూరు జిల్లా తెనాలి వేదికగా ఈనెల 18, 19 తేదీల్లో ఏపీ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొన్న జిల్లా క్రీడాకారులు మొత్తం 13 పతకాలు సాధించి శభాష్ అనిపించారు. ఇందులో నాలుగు బంగారు, రెండు రజతాలు, మరో ఏడు కాంస్య పతకాలు ఉన్నాయి. జిల్లా తైక్వాండో బృందానికి కోచ్ మేనేజర్లుగా కురిటి తారకరామా, లక్ష్మణరావు, ముద్దాడ శిరీష వ్యవహరించి మెప్పించారు. సబ్ జూనియర్స్‌లో వివిధ బరువుల కేటగిరిల్లో నరేంద్రనాయుడు కాంస్యం, లీలా మాధవ్ స్వర్ణం, మహర్ష్ కాంస్యం, మహేష్ కాంస్యం, త్రివేణి కాంస్యం, యషిత స్వర్ణం, దేవీప్రియ కాంస్యం, పల్లవి కాంస్య పతకాలు సాధించారు. అలాగే క్యాడేట్స్‌లోని వివిధ బరువు కేటగిరీల్లో మోక్షిత్ రజతం, ఢిల్లేశ్వరరావు స్వర్ణం, ప్రశాంత్ రజతం, హిమచందన్ కాంస్యం, తన్మయ్ స్వర్ణ పతకాలతో మెరిశారు. వీరి రాణింపుపై ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి, ముఖ్య సలహాదారు పి.సుందరరావు, తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ కొమర భాస్కరరావు తదితరులు అభినందించారు.

'క్రీడలకు అధిక ప్రాధాన్యత'



పోటీల్లో విజేతలు, నిర్వాహకులతో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. టీడీపీ హయాంలో పూర్తిగా క్రీడలను నిర్లక్ష్యం చేశారని, అయితే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి క్రీడలకు తగు ప్రాధాన్యత ఇస్తూ నిధులు వెచ్చిస్తున్నారని తెలిపారు. మండలంలోని గుండవల్లిపేట వద్ద ఒక కల్యాణ మండపంలో రాష్ట్ర స్థాయి పదో వెయిట్ లిఫ్టింగ్ పోటీలను పురుషులు, మహిళల విభాగాల్లో మూడు రోజులు నిర్వహించారు. ఆదివారం రాత్రితో పోటీలు ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని విజేతలకు బహుమతులు అందించారు. 49 కిలోల కేటగిరీలో డి.హేమశ్రీ, జి.వర్షిత, పి.ధనం, ఎస్.లలితలు సీనియర్, జూనియర్ విభాగాల్లో మెడల్స్ పొందారు. నరసన్నపేటకు చెందిన నేతింటి లలిత గోల్డ్ మెడల్ పొందారు. పురుషుల విభాగంలో ఎం.తరుణ్, జయప్రకాష్, బి.నాగరాజులు మెడల్స్ పొందారు. కార్యక్రమంలో వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఏపీ అధ్యక్షుడు నీలంశెట్టి లక్ష్మి, కార్యదర్శి దిన్నా బాబు, వైస్ ప్రెసిడెంట్లు వెంకటరామయ్య, ఐ.భాస్కరరావు, శ్రీకాకుళం అసోషియేషన్ కార్యదర్శి కె.శ్రీనివాసరావు, జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ వ్యవస్థాపకులు కొత్తకోట అమ్మినాయుడు పాల్గొన్నారు.

'నీట్ పీజీలో అడ్మిషన్లు సరిచేయాలి'

కాశీబుగ్గ: ఇటీవల జరిగిన పీజీ మెడికల్ అడ్మిషన్‌లలో జరిగిన పొరపాట్లను సరి చేయాలని జిల్లా గ్రామీణ వినియోగదారుల సమాఖ్య అధ్యక్షుడు డి.ఉమామహేశ్వరరావు కోరారు. రాష్ట్ర గవర్నర్‌కు ప్రత్యేకంగా లేఖ రాసి పంపిస్తూ అనంతరం పలాసలో పాత్రికేయులకు ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన నీట్ అడ్మిషన్‌లలో గైనకాలజీ సీటు కేటాయింపులో జరిగిన తప్పిదాన్ని ప్రస్తావించారు.

కలెక్టర్‌ను కలిసిన సింగపూర్ రెడ్‌క్రాస్ ప్రతినిధులు



సింగపూర్ రెడ్‌క్రాస్ ప్రతినిధులతో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: సింగపూర్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు కలెక్టర్‌ను సత్కరించారు. మందసలో ఉన్న ఆదివాసీ గ్రామాలు మద్దకుల, చిన్నరంగా మటియ, బిత్ర బండ, కొంటసాయి, బలియాసియా, భవానిపురం, కోయిట్యు పానకల తదితర గ్రామాలను సందర్శిస్తామని సింగపూర్ ప్రతినిధులు తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ నడిపిస్తున్న శాంత కళ్యాణ అనురాగ నిలయం, సీవీ నాగజ్యోతి ఆనంద నిలయాలను సందర్శించి అక్కడి పరిస్థితులు తెలుసుకున్నామని కలెక్టర్‌కు చెప్పారు. జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్ మోహన్ రావు జిల్లాలో జరుగుతున్న సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో సీవీ నాగజ్యోతి అనాథ నిలయం వ్యవస్థాపకులు సీవీఎస్ మూర్తి, రెడ్‌క్రాస్ సెక్రటరీ బి.మల్లేశ్వరరావు, కమిటీ సభ్యులు దుర్గా శ్రీనివాస రావు, పి.శ్రీకాంత్, రెడ్‌క్రాస్ సభ్యులు కె.సత్యనారాయణ, పెంకి చైతన్య కుమార్, సాయి సుధాకర్ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర హ్యాండ్‌బాల్ పోరులో శ్రీకాకుళం తృతీయం

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర హ్యాండ్‌బాల్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా బాలికల జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు వేదికగా ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు 9వ ఏపీ రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాలికల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్-2023 పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో జిల్లా బాలికల జట్టు తృతీయ స్థానంలో నిలిచి మెరిసింది. జిల్లా జట్టుకు కోచ్ మేనేజర్‌గా ఫిజికల్ డైరెక్టర్ డి.ఈశ్వరరావు వ్యవహరించి ముందుండి నడిపించారు. జిల్లా జట్టు రాణింపుపై హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సుంకరి కృష్ణకుమార్, కార్యదర్శి ఎమ్మెస్సీ శేఖర్, సంఘ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

'సీఎం వైఎస్ జగన్ స్ఫూర్తితో రేవతీపతి ట్రస్టు సేవలు'



కొర్ల రేవతీపతి ట్రస్టు ద్వారా టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అందజేసిన పోటీ పరీక్షల పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ, సబ్ కలెక్టర్ నూరుల్ కమార్, ట్రస్టు చైర్మన్ శిరీషా శ్రీనివాస్ తదితరులు

టెక్కలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల స్ఫూర్తితో దివంగత టెక్కలి ఎమ్మెల్యే కొర్ల రేవతీపతి మెమోరియల్ ట్రస్టు సేవలు కొనసాగిస్తున్నట్లు ట్రస్టు చైర్మన్ కొర్ల శిరీష శ్రీనివాస్ వెల్లడించారు. గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల కోసం వివిధ పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను, బీరువాను కొర్ల రేవతీపతి ట్రస్టు ద్వారా సోమవారం అందజేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమార్, వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజవకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్సీ దువ్వాడ మాట్లాడుతూ ట్రస్టు ద్వారా సమకూర్చిన పోటీ పరీక్షల పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం సబ్ కలెక్టర్ నూరుల్ కమార్ మాట్లాడుతూ లక్ష్యం దిశగా వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. నియోజకవర్గ సమన్వయకర్త వాణి మాట్లాడుతూ ప్రస్తుతం సెల్‌ఫోన్ యుగంలో సైతం పుస్తకాలకు ఎంతో విలువ ఉందన్నారు. రేవతీపతి ట్రస్టు ద్వారా మంచి కార్యక్రమాన్ని నిర్వహించారని ఆమె పేర్కొన్నారు.

అనంతరం ట్రస్టు చైర్మన్ కొర్ల శిరీషా శ్రీనివాస్ మాట్లాడుతూ తన తండ్రి దివంగత ఎమ్మెల్యే కొర్ల రేవతీపతి ఆశయాలకు అనుగుణంగా సీఎం వైఎస్ జగన్ స్ఫూర్తితో తమ ట్రస్టు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. సివిల్స్ సాధనలో భాగంగా విద్యార్థులకు అండగా నిలుస్తామని అన్నారు. కళాశాల గ్రంథాలయంలో నిత్యం పుస్తక పఠనం చేసిన విద్యార్థులకు ట్రస్టు ద్వారా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొర్ల భారతి, ఎంపీపీ ఎ.సరోజనమ్మ, డాక్టర్ దువ్వాడ హైందవి, ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ, వైస్ ప్రిన్సిపాల్ బి.సతీష్‌కుమార్, స్థానిక నాయకులు హెచ్.ఉదయ్‌భాస్కర్, మోహన్, రాహుల్, అప్పలరెడ్డి, రేవతిపతి ట్రస్టు ఆర్గనైజర్ చిగిలిపల్లి శ్రీనివాస్, స్థానిక నాయకులు ఉదయ భాస్కర్, పీవీజీ గుప్తాతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గ్రంథాలయంలో నిత్యం పుస్తక పఠనం చేసిన విద్యార్థులకు రేవతీపతి ట్రస్టు ద్వారా బహుమతులు అందజేస్తున్న సమన్వయకర్త దువ్వాడ వాణి

ప్రభుత్వ సేవలపై ఆరా



బెండిలో మహిళతో మాట్లాడుతున్న బృంద సభ్యులు

వజ్రపుకొత్తూరు: ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సేవల వివరాలను ఢిల్లీ బృంద సభ్యులు సేకరించారు. ఈ మేరకు వారు సోమవారం మండలంలో పర్యటించి తహసీల్దార్ బి.అప్పలస్వామిని కలిసి రేషన్ డిపోల ద్వారా లబ్ధిదారులకు అందుతున్న నాణ్యమైన బియ్యం పంపిణీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే బెండిలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. చిన్నారులకు ప్రభుత్వ బడుల్లో అందుతున్న మధ్యాహ్న భోజనం, రేషన్ బియ్యం తదితర అంశాలను తెలుసుకొని ప్రభుత్వ సేవలను అభినందించారు. తృణ ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ జోసెఫ్ రాజు, ఎంపీవీ సత్యనారాయణ, బృంద సభ్యులు డాక్టర్ షహీబా కోహ్లీ, డాక్టర్ విదీసా, శర్మా, ఆయుషి ధమ్మని, దుర్యోధన తదితరులు ఉన్నారు.

దోచుకోవడమే టీడీపీ నాయకుల పని

- స్పీకర్ తమ్మినేని సీతారాం



జలజీవన్ మిషన్ పథకంలో వాటర్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

పొందూరు: ప్రజల సొమ్మును సంక్షేమ పథకాల రూపంలో ఆ ప్రజలకే తిరిగి అందిస్తుంటే చంద్రబాబు అడ్డుకోవాలని చూస్తున్నారని, మూడు పర్యాయాలు సీఎంగా చేసిన చంద్రబాబు ఆ సమయంలో దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారని స్పీకర్ తమ్మినేని సీతారాం విమర్శించారు. పొందూరు నెహ్రూ పార్కు ఆవరణలో జలజీవన్ మిషన్ ద్వారా రూ.5కోట్లతో ట్యాంక్, ఇంటింటికీ కుళాయిల ఏర్పాటుకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. కూన రవికుమార్ విప్‌గా ఉన్నప్పుడు అతని సోదరుడు నియోజకవర్గంలోని రోడ్ల కాంట్రాక్ట్‌లను దక్కించుకున్నాడని, అతని నిర్వాకం మూలంగానే ఆమదాలవలస రోడ్డుకు ఆ గతి పట్టిందని తెలిపారు. సింగూరు రోడ్డు కొట్టుకుపోయిందని, తాడివలసలోని రెల్లిగెడ్డలో నిర్మాణం కొట్టుకుపోయిందని, దీని కారణంగా 8 మంది అధికారులు సస్పెండ్ అయ్యారని తెలిపారు. వెన్నెలవలసలో 100 ఎకరాల భూమిని కాజేయాలని చూశారని, పోలీసు స్టేషన్ వెనుక ఒక ఎకరా స్థలంలో టీడీపీ కార్యాలయం కట్టేందుకు ఏర్పాట్లు చేశారని చెప్పారు.

రూ.2వేల కోట్లతో..

నియోజకవర్గంలో ప్రజల దాహార్తి తీర్చడానికి రూ. 2007 కోట్ల నిధులు మంజూరు చేయించానని తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్‌లో ఉపసర్పంచ్ అనకాపల్లి గోవిందరావు, వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి బందారు జైప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ పొందూరు మండలంలో కేశవదాసుపురం వద్ద ఎస్‌ఏసీఎల్ ఫ్యాక్టరీ మూలంగా చుట్టు పక్కల మండలాల్లో గాలి, నీరు, భూమి కలుషితమైందని చెప్పారు. ఇది తొగరాం వరకు వ్యాపించిందన్నారు. పొందూరు మండలంలో కేశవదాసుపురం, నందివాడ, లోలుగు, బురిడికంచరాం, కృష్ణాపురం తదితర గ్రామాల ప్రజలు ఎస్‌ఏసీఎల్ మూలంగా కలుషిత నీరు తాగుతుండటంతో వారి కిడ్నీలు పాడైపోయి బాధపడుతున్నారని చెప్పారు. అలాంటి సమస్యలు ఎవరికీ రాకూడదని తొగరాం–గంగ్రేడు గ్రామాల గుండా వెళ్తున్న నాగావళి నదిలోని నీటిని పొందూరు ప్రజలకు అందించనున్నామని చెప్పారు. నది నుంచి 14 కిలోమీటర్ల దూరంలో వున్న రాపాక కొండమీద 2 లక్షల లీటర్ల నీటి కెపాసిటీతో ట్యాంక్‌ను నిర్మించి నదిలోని నీటిని సప్లై చేసి శుద్ధి చేసి అందిస్తామన్నారు. అందుకు రూ. 50 కోట్లు నిధులు మంజూరు చేశానని చెప్పారు. పొందూరు గ్రామంలో రూ.3 కోట్లతో రోడ్లను వేయించానని చెప్పారు. మిగిలిన రోడ్లన్నీ పూర్తి చేయిస్తానని చెప్పారు.

పొందూరులో ఎంజేపీ పాఠశాలను, డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయించానని, ఆమదాలవలస ఎంజేపీ జూనియర్ కళాశాలను, తొగరాంలో అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలను, బూర్జలో హార్టీ కల్చర్ రీసెర్చ్ సెంటర్‌ను, దన్నానపేటలో ఉమెన్స్ పాలిటెక్నిక్ కళాశాలను మంజూరు చేయించామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, పార్టీ మండల కన్వీనర్ పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ కొంచాడ రమణమూర్తి, పొందూరు పట్టణ అధ్యక్షుడు గాడు నాగరాజు, వైస్ ఎంపీపీ వండాన వెంకటరావు, వండాన సూరపునాయుడు, వడగ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.